

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

సేతు మాధవన్

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో రెవెన్యూ, భూ రీసర్వే సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ వెల్లడించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్ లో జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ భూ సమస్యల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారు. 2020 ఐఎఎస్ బ్యాచ్ కి చెందిన ఆయన ప్రకాశం జిల్లాలో ట్రైనింగ్ కలెక్టర్ గా , మార్కాపురం సబ్ కలెక్టర్ గా పనిచేసిన అనుభవం ఉంది. రాష్ట్ర ఎం ఎస్.ఎం.ఇ శాఖలో సిఇఒగా పనిచేస్తూ బదిలీపై జిల్లకు జాయింట్ కలెక్టర్ వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జెసి మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఎం హరినారాయణన్ను కలిసి పూలమొక్క అందజేశారు.

ప్రజా సమస్యలపై

సిపిఎం విస్తృత పోరాటాలు

నగర నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభం - ప్రజల నుంచి విశేష స్పందన

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజా సమస్యలపై సిపిఎం విస్తృత పోరాటాలు నిర్వహించి ప్రజలపక్షాన నిలిచిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. బుధవారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలే అజెండాగా నగర నియోజకవర్గ పరిధిలో విస్తృత ప్రచారాన్ని ప్రారంభించారు. 15వ డివిజన్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మత ఘర్షణలను ప్రోత్సహిస్తూ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. మైనార్టీల, దళితులపై దాడులకు పాల్పడుతుందన్నారు. అటువంటి పార్టీని ప్రజలు ఓడించాలన్నారు. లౌకిక పార్టీలైన కాంగ్రెస్, వామపక్షపార్టీ, ఆమ్ఆద్మీ పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నగరంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయింపు, ఇళ్ల పట్టాల పంపిణీ, రేషన్కార్డులు సమస్య, టిడ్కో ఇళ్ల కేటాయింపు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, తాగునీటి సరఫరా, దోమల నివారణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సిపిఎం సీనియర్ నేత చంద్ర రాజగోపాల్ పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నగర నియోజకవర్గానికి సిపిఎం పోటీ చేస్తుం దన్నారు. ఒకటి రెండు రోజుల్లో నగర నియోజకవర్గంలో పోటీ చేసే సిపిఎం అభ్యర్థి పేరును రాష్ట్ర కమిటీ ప్రక టిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసే సిపిఎం పార్టీకి నగరంలో ఘన చరిత్ర ఉంద న్నారు. ఇటీవల అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలంటూ చేసిన 44 రోజుల పోరాటానికి సిపిఎం అండగా నిలిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆశ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, నగరంలో డ్రైనేజీ సమస్య, రహదారుల సమస్య, దోమల సమస్య, దళితులపై దాడులు జరిగిన సమయంలో న్యాయం చేయాలంటూ సిపిఎం పోరాటాలు చేపట్టిం దన్నారు. మతతత్వ బిజెపితో పొత్తు పెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగాలనుకుంటున్న టిడిపి జనసేన, నిరంకుశ అధికార వైసిపి పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయడం వంటి పలు రకాల ఆలోచనలు చేస్తూ రాష్ట్రాన్ని తీవ్రంగా నష్టపరిచిందన్నారు. ఈ పర్యటనలో ప్రజలు సిపిఎం నాయకులకు పూలమాలలు వేసి ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, జి. నాగేశ్వరరావు, పి. సూర్యనారాయణ, కత్తి పద్మ, మూలం ప్రసాద్, డివైఎఫ్ఐ నాయకులు ఎం.వి.రమణ, బిపి నరసింహా, రమణారెడ్డి, సుబ్బమ్మ, చిరంజీవి, 15వ డివిజన్ శాఖ నాయకులు అల్లంపాటి శ్రీనివాసులరెడ్డి ఉన్నారు

జెండా ఊపి ప్రచారాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్

సిపిఎం నాయకులకు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

నెల్లూరు క్లీన్ స్వీప్ చేస్తాం..

ఎంపి విజయసాయిరెడ్డి - నెల్లూరులో క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం 7 అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను వైసిపి ఘన విజయం సాధిస్తుందని రాజ్యసభ సభ్యులు, నెల్లూరు పార్లమెంట్ నియోజక వర్గ సమన్వయకర్త విజయసాయి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు పట్టణంలో రామ్మూర్తి నగర్లో బుధవారం క్యాంపు కార్యాలయం ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను నెల్లూరులో పుట్టానని, ఇక్కడే పెరిగానని, విద్యాభ్యాసం చేశానని తాను పుట్టిన గడ్డకు రుణం తీర్చుకునే అవకాశం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరుకు రోడ్డు, రైలు కనెక్టివిటీ ఉన్నప్పటికీ ఎయిర్ కనెక్టివిటీ లేదని, ఇక్కడ పరిశ్రమలు, అక్వా, వ్యవసాయ రంగ ఉత్పత్తులు ఎయిర్ కనెక్టివిటీ సదుపాయం కల్పించడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. తాను పార్లమెంటులో టూరిజం, ట్రాన్స్ పోర్టు, కల్చర్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్గా ఉన్నందున దగదర్తి ఎయిర్ పోర్టు నిర్మాణానికి మరింతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లా వాసిగా ఇక్కడి పరిస్థితులపై తనకు పూర్తి అవగాహన ఉందని, త్వరలోనే తన ప్రణాళిక వెల్లడిస్తానన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనపై ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని, ఈ మేరకు కందుకూరు నుంచి నెల్లూరు వరకు దారి పొడవునా ప్రజలు చూపించిన అభిమానమే ఇందుకు నిదర్శనమన్నారు. సంక్షేమంలో దూసుకుపోతున్న జగన్ ప్రభుత్వం అభివృద్ధిలో వెనుకబడిందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గత చంద్రబాబు పరిపాలనతో పోల్చుకుంటే 2019-24 మధ్య జగన్మోహన్ రెడ్డి అందించిన సుపరిపాలనతో ప్రజల తలసరి ఆదాయం పెరిగిందని, అలాగే రాష్ట్ర స్థూల ఉత్పత్తి కూడా పెరిగిందని సూచికలు చెబుతున్నాయన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారి జీవన ప్రమాణాలు పెంచారన్నారు.

సిద్ధం సభలకు తరలిరండి

జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో 2024 ఎన్నికలకు తామంతా సిద్ధంగా ఉన్నామని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, మేనిఫెస్టో అన్ని అంశాల్లోనూ సిద్ధంగా ఉన్నామని, ముఖ్యమంత్రి ఫేస్ తో తాము ఎన్నికలకు సిద్ధమన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చేస్తుంటే రానున్న ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ స్థానాలతో పాటు 25కి 25 పార్లమెంట్ స్థానాలు గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు, ఎంఎల్సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు మేయర్ స్రవంతి, పార్టీ ఎస్సి విభాగ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొ న్నారు. తొలుత నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కందుకూరు సరిహద్దుల నుంచి కావలి, ఉదయగిరి, కోవూరు, నెల్లూరు నగరం తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు.

'పర్వతరెడ్డి'కి వైసిపి అధ్యక్ష బాధ్యతలు..!

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఎంఎల్సి పర్వపతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి కీలక బాధ్యతలు అప్పగించారు. వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ సిఎం ఆదేశాలు జారీ చేశారు. వైసిపి జిల్లాలో కిష్టపరిస్థితుల్లో ఉంది. ఇలాంటి సమయంలో ఆయనకు బాధ్యతలు అప్పగించడం గమనార్హం. విద్యావేత్తగా, ఉన్న ఆయన ఇటీవల ఎంఎల్సి ఎన్నికల్లో విజయం సాధించారు. వైసిపి ఆవిర్భావం నుంచి మేకపాటి రాజమోహన్రెడ్డి, ఎల్లసిరి గోపాల్రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్రెడ్డి, మేరిగ మురళి, కాకాణి గోవర్ధన్రెడ్డిలు, వేమిరెడ్డి ప్రభా కర్రెడ్డిలు ఈ బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల ఆపార్టీలో కీలకమైన నేతలు పార్టీకి దూరమయ్యారు. ఇటీవల వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి టిడిపిలో చేరారు. ఇలాంటి సమయంలో వైసిపి పెద్దగా ఆయనను నియమించారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు తీసుకొస్తారో చూడాలి.

పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి మ స్తాన్ బి

అన్ని రంగాల్లోనూ మహిళలు రాణింపు : ఐద్వా

9న మహిళా సదస్సు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తు న్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి మ స్తాన్ బి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్న మహిళా సదస్సును పురస్కరించుకొని బుధవారం ఆమె ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మతో కలిసి తోటపల్లిగూడూ రు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు మారు బోయిన రాజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మస్తాన్ బి మాట్లాడుతూ చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ ప్రక్రియను రాజకీ య ప్రయోజనాలకు ఉపయోగించు కొంటున్నారే తప్ప మహిళలకు న్యాయం చేయాలన్న ఆలోచన ఇప్పటి వరకు పాలకులకు లేకపోవడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నరుకూరు వాణి మహల్లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మస్తాన్ బి కోరారు. ముఖ్య అతిథిగా ఎపి అంగన్వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ, ఎల్ ఐ సి యూనియన్ మాజీ నాయకులు ఎస్. జగదీశ్వరి, యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్. రెహానా బేగం,సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసా ద్, ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా, సిఐటి యు మండల అధ్యక్షులు మస్తానమ్మ ఉన్నారు.

హెల్త్ అడ్మినిస్ట్రేషన్

మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్కు గుర్తింపు

నెల్లూరు : వైద్య,ఆరోగ్య శాఖలో హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ను మొట్టమొదటిగా గుర్తింపు సంఘంగా జిఒఎంఎస్ నెం. 24 అనుమతి ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు, జిల్లా జనరల్ సెక్రెటరీ బి.కమల్ కిరణ్ పేర్కొన్నారు.బుధవారం స్థానిక హరినాధపురం ప్రాంతంలోని అసోసియేషన్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు నాయకులు మాట్లాడుతూ అసోసియేషన్కు ప్రభుత్వ గుర్తింపు లభించినందుకు వైద్య , ఆరోగ్య శాఖ ఉద్యోగుల డిమాండ్ల సాధనలో నిర్విరామంగా కషి చేస్తూ ఉద్యోగుల అభ్యున్నతికి పాటుపడు తున్న వైద్య శాఖ ఉద్యోగుల ఆశాజ్యోతి రాష్ట్ర అధ్యక్షులు ఆరవ పాల్కు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అసోసియేషన్ గుర్తింపు కోసం కషి చేసిన కర్నూలు జిల్లా ప్రెసిడెంట్ రఘు బాబు కి, చిత్తూరు జిల్లా ప్రెసిడెంట్ రాజాకి ధన్యవాదాలు తెలిపారు. హంస నాయకులు జిల్లా జనరల్ సెక్రెటరీ బి కమల్ కిరణ్, జిల్లా ట్రెజరర్ శేషగిరిరావు, హంస ఉద్యోగ సంఘ, నాయకులు, మజారుల్లా, శశికళ, వరప్రసాద్ ,ఖాదర్బాషా ,సుధాకర్ ఉన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి - కందుకూరు

2023-24 పంట కాలానికి కందుకూరు పొగాకు వేలం 26, 27 వేలం కేంద్రాల్లో సెక్రెటరీ ఇన్ఛార్జి వేలం మేనేజర్ దివి వేణు గోపాల్ రావు పొగాకు కొనుగోళ్లను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. వేణుగోపాలరావు రైతుల కు పలు సూచనలు చేశారు. బేళ్లను వేలం కేంద్రానికి తెచ్చే ముందు రోజు విధిగా మార్కెట్కు వచ్చి వేలాన్ని పరిశీలించాలని తెలిపారు. దానిని బట్టే బేళ్ల తీసుకురావాలని కోరారు. రెండు వేలం కేంద్రాల అధి కారులు కె రాజగోపాల్ రెడ్డి , చైనా రామ్ మీనా, రైతు నాయకులు మాదాల రమణయ్య, తాటికొండ రమణయ్య, కొండారెడ్డి ఉన్నారు.

540 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరులోని రెండో సచివాలయం దగ్గర వైద్యాధికారి డాక్టర్ మారుతీ రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 540 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. డాక్టర్ సాయి ప్రియాంక డాక్టర్ భార్గవ కంటి వైద్య నిపుణులు ఎఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు

రైతులకు సాయం అందజేత

ప్రజాశక్తి -నెల్లూరు : తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పెట్టుబడి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరి నారాయణ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని శంకరన్ హాలులో ఖరీఫ్ సీజన్ లో వర్షాభావం, రబీలో మిచౌంగ్ తుపాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారంగా రూ. 2.65 కోట్ల మెగా చెక్కును కలెక్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావం, తుపాన్ కారణంగా సుమారు 4వేల మంది రైతులు నష్టపో యారన్నారు. జిల్లాలో నష్ట పోయిన ఉద్యాన వన పంటల రైతులు 3వేల822 మందికి రూ. 2.32కోట్లు దెబ్బతిందన్న వ్యవసాయ పంటల 425 మంది రైతులకు 33లక్షల రూపాయలు పెట్టుబడి సాయం అందించినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి. సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి డి.సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు డి.నిరంజన్ రెడ్డి, వై. ఎస్.ఆర్. హార్టికల్చర్ బోర్డు సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, రైతు సంఘ ప్రతినిధులు కోటారెడ్డి ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

హాజరైన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి -నెల్లూరు : సమాజంలో ప్రతి అడుగులోనూ వైద్యుల ప్రభావం ఎంతగానో కని పిస్తుందని, ఈ నేపథ్యంలో వారు పాటించే నైతిక ప్రమాణాలు సమాజపు భవి ష్యత్తును నిర్ణయిస్తాయని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. నగరంలోని ఎసి సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజం పట్ల గౌరవం, మానవీయ విలువ లే వైద్యవత్తిలో ఉన్న వారి విలువను మరింత పెంచుతాయని ఆయన గుర్తు చేశారు. నగరంలోని ఎసి సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలువురు వైద్య విద్యార్థులకు ఆయన పట్టాలను ప్రదానం చేశారు. వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా. వసుంధరా దేవి, సూపరిండెంట్ డా. సిద్ధా నాయక్, ఆర్డీవో శ్రీ మాలోల పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

ప్రజాశక్తి -పొదలకూరు

పట్టణంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్లో బుధవారం సరస్వతి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఏటా వస్తున్న ఆనవాయితీ లో భాగంగా విద్యార్థులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్వైజర్లు గాయత్రి, ఎన్. లక్ష్మీ దుర్గ మాట్లాడారు. పట్టణానికి చెందిన వేగమ సుబ్బారావు స్వామి సరస్వతి పూజను జరిపించారు. విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులు,జామెంట్రీ బాక్స్ లు అందజేశారు. పాఠశాల చీఫ్ అడ్వైజర్ ఎన్.బాలు, విజ్ఞాన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ అన్నం సుబ్బారావు, అకడమిక్ ఇన్ ఛార్జ్ ఎ చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యాయులు పూజా పాల్గొన్నారు.

సురేష్ బాబుకు సన్మానం

ప్రజాశక్తి -నెల్లూరు : న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సురేష్ బాబును కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. బుధవారం బుజబుజ నెల్లూరు ప్రాంతంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఈ సన్మానం నిర్వహించారు. ఇటీవల న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నగరంలో జరిగాయి. జిల్లా కోర్టు ఆవరణంలో సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో సురేష్ బాబు జిల్లా అధ్యక్షులుగా 47 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అధ్యక్షులుగా ఎన్నికైన సం దర్భంగా బుజ బుజ నెల్లూరులోని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ సన్మానించారు. మాజీ సర్పంచ్ పిగిలం నరేష్, విశ్రాంత ఆర్టిసి ఎంప్లాయ్ శాగల సాయి, బొడ్డు రాము, దొడ్డక రమేష్ పాల్గొన్నారు.

వాహనాలకు వేలం

ప్రజాశక్తి-కందుకూరు : రవాణా శాఖ వారి తనిఖీలలో భాగంగా సరియైన పత్రాలు లేని పట్టుబడిన వాహనాలను ఆర్టీసీ డిపో నందు సిస్ చేయుట జరిగింది. 2018 నుండి ఇప్పటివరకు విడుదల చేసుకొని కారణంగా అట్టి వాహనములను నెల్లూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ బి. చందర్ ఆదేశాల మేరకు కావలి ప్రాంతీయ రవాణాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మోటార్ వాహనముల తనిఖీ అధికారి వారి కార్యాలయం కందుకూరు నందు సిజ్ చేసిన వాహనాములను వేలం వేయడం జరిగినది. అందులో భాగంగా మొత్తం 26 వెహికల్స్ను వేలం వేయగా మొత్తం 4,85,000 రూపాయలు ప్రభుత్వంనికి ఆదాయం సమకూరినట్లుగా ఆర్టిఒ సుధాకర్ రెడ్డి తెలిపారు. కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్కె ఎమ్డి రఫీ , కావలి ఎంవిఐ శ్రీ సుందరరావు, కావాలి ఏ ఓ సుభాషిణి పాల్గొన్నారు.

సాయి మందిరం వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -పొదలకూరు

పట్టణంలోని షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం ఉదయం 18 వ వార్షికోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. షిరిడి సాయిసేవా సమితి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, నాగిశెట్టి దామోదరరావు, కోశాధికారి పంగులూరు సుబ్బానాయుడు, సభ్యులు లక్కాకుల ఆనందరావు, కె కోటేశ్వరరావు, నెట్టెం భాస్కర్ నాయుడు, తుమ్మల శ్రీనివాసులు, కదిరి పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీ గాయత్రి విద్యార్థుల జయకేతనం

ప్రజాశక్తి-కందుకూరు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 5వ సెమిస్టర్ డిగ్రీ పరీక్షా ఫలితాలలో శ్రీగాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థుల జయకేతనం ఎగురవేశారు. బిఎస్సి బిజడ్సి విభాగంలో అరివేణి శివరాణి 94శాతంతో కాలేజీ ఫస్ట్, బిఎస్సి ఎంపిసీయసీ విభాగంలో కూటగుళ్ల వెంకట దుర్గా లోకేష్ 92శాతం తో కాలేజీ ఫస్ట్ బిఎస్సీ ఎంయస్సి విభాగమునందు నాగిశెట్టి సుకన్య 87శాతం తో కాలేజీ ఫస్ట్. మ్యాథమ్యాటిక్స్ 100కి 100 మార్కులు సాధించినటువంటి మా విద్యార్థులు అన్నవరపు ప్రత్యూష,బోడా భాను ప్రసాద్, కోటగుళ్ల వెంకట దుర్గా లోకేష్, బొగ్గవరపు వెంకట నాగలక్ష్మి అయినంపూడి శివమణి 100 మార్కులకు 98బోటనీ విభాగంలో 100 మార్కులకు 99 మార్కులు సాధించిన తమ విద్యార్థి అరివేని శివరాణి జువాలజీ విభాగంలో వందకి 95 మార్కులు సాధించిన తమ విద్యార్థిని సౌందర్య స్వరూపిణి స్టాటిస్టిక్స్ విభాగమునందు వందకి 98 మార్కుల సాధించిన తమ విద్యార్థిని నాగిశెట్టి సుకన్య. 5వ ఫిఫ్త్ సెమిస్టర్ అన్ని గ్రూపులలో 89శాతం పాస్ పర్సంటేజ్ తో అద్భుత ఫలితాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గాయత్రి విద్యాసంస్థల అధినేత సిహెచ్ రామకష్ణారావు , డైరెక్టర్ భరద్వాజ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పోలిశెట్టి గీతా శ్రీనివాసరావు , శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ ఉషా చంద్రిక అభినందనలు తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

టిడిపి నాయకుల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు : 50 ఏళ్లు దాటిన బిసిలకు నెలకు 4 వేల పింఛన్ ఇస్తామని చెప్పటం చారిత్రాత్మక నిర్ణయమని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మూడో వార్డు ఉప్పు చెరువు మొదటి లైన్ ప్రాంతంలో ఆయన బుధవారం ప్రచారం చేపట్టారు. స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, వార్డు అధ్యక్షుడు పువ్వాడి కోటయ్య, 3వ వార్డు నాయకులు మరియు చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ళ రవిచంద్ర, రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

17వ వార్డులో.. కందుకూరు పట్టణంలోని 17వ వార్డు బీసీ కాలనీలో శంఖారావం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు బుధవారం నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య కాలనీలోకి వచ్చిన ఇంటూరి సౌజన్య కి స్థానికులు పలికారు. బాబు సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. వార్డు అధ్యక్షుడు దివి శ్రీనివాసరావు, యనమల రాజేశ్వరి, తన్నీరు లక్ష్మి, కత్తి ఆశీర్వాదం, కత్తి జయరావు, పరుసు రఘు, గుమ్మడి శివ, గళ్ళ రమణయ్యతోపాటు పట్టణ మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ ఉన్నారు.

సుబ్బయ్య సేవలు మరువలేనివి..

ప్రజాశక్తి-గుడ్లూరు : ముత్తవారిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రజా సేవకుడు ముత్తం సుబ్బయ్య సేవలు మరువలేనివని కందుకూరు మాజీ ఎంఎల్ఎ దివి శివరామ్ పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ముత్తం సుబ్బయ్య చిత్రపటానికి పూలమాలవేసి దివి శివరాం నివాళు లర్పించారు. సుబ్బయ్య మరణం గ్రామానికి తీరల లోటు అన్నారు. ఫిబ్రవరి 25న సుబ్బయ్య మృతిచెందాడు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సంతాపం తెలిపారు.



సుబ్బయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎంఎల్ఎ దివి శివరామ్

ఉలవపాడులో 'బుర్రా'కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఉలవపాడు : ఉలవపాడు ఏర్పాటు చేసిన వైసిపి ఆత్మీయ సమావేశానికి హాజరైన కందుకూరు నియోజకవర్గం సమన్వయకర్త బుర్రా బుర్ర మధుసూదన్ యాదవ్ కు ఘన స్వాగతం లభించింఇ. ఉలవపాడు నార్త్ బైపాస్ నుండి భారీ ఎత్తున ర్యాలీతో బయలుదేరిన బార్రా ర్యాలీ మొదట దర్గాలో ప్రార్థనలు, వినాయక గుడిలో పూజలు నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. బుధవారం నాడు జరిగిన ఈ కార్యక్రమానికి మం డలంలోని వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంఎల్ఎ మహీధర్రెడ్డి ఆశీస్సులతో కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులుగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామాలసింగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాల కొండయ్య ,ఎనమాల మాధవి, లతా చంద్రశేఖర్, మానీకుల నాగ లక్ష్మి, వెలిచర్ల చంద్రశేఖర్, అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, ధనుకోటి, షేక్ ఖాదర్ భాష, రమణయ్య, ఎన్. పోతురాజు, రఫీ కోటు కోటిలింగం ఉన్నారు.



మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్ యాదవ్

విజయసాయిరెడ్డికి స్వాగతం పలికిన 'బుర్రా'

నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసారెడ్డి నెల్లూరులో క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి వెళ్తున్న సందర్భంగా బుధవారం ఉలవపాడు మండలం కరేడు ర్యాంపు జాతీయ రహదారి వద్ద కనిగిరి ఎంఎల్ఎ బుర్ర మధుసూదన్ యాదవ్, ఘనంగా స్వాగతం పలికారు. విజయసాయిరెడ్డికి గజమాలతో సత్కరించారు. మధుసూదన్ రావు భారీ కాన్వాయ్ తో నెల్లూరు బయలుదేరారు.

డిగ్రీ ఫలితాల్లో

'టిఆర్ఆర్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మూడో సంవత్సరం ఐదో సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవి కుమార్ తెలిపారు. కళాశాల విద్యార్థులు భౌతిక శాస్త్రం, వక్ష శాస్త్రం, జంతు శాస్త్రం ,ఆక్వాకల్చర్ -రెండు పేపర్లలోనూ 100శాతం ఉత్తీర్ణత సాధించారు. గణిత శాస్త్రం, రసాయన శాస్త్రం, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో రెండు పేపర్లలోనూ 96శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ,అధ్యాపకులు విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే పేద విద్యార్థులకు అత్యున్నత విద్యనందిస్తూ వారు జీవితంలో మెరుగైన స్థానానికి చేరుకోవడానికి సహకారం అందిస్తుందన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ప్రియుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వివాహేతర సంబంధంలోని ప్రియుడిని హతమార్చాలని పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన ఆత్మకూరు మండలం, అప్పారావుపాలెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. సిఐ వేణు వివరాల మేరకు.. అప్పారావు పాలెం గ్రామానికి చెందిన వజ్రమ్మకు మస్తాన్ రెడ్డి అనే అవివాహిత యువకుడితో వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల ఆమె వేరొకరితో చనువుగా ఉండటం గమనించిన మస్తాన్ రెడ్డి అది మంచిది కాదంటూ హెచ్చరించారు. అందుకని ఆమె ప్రియుడు మస్తాన్‌రెడ్డిని హతమార్చాలని నిర్ణయించుకుంది. కడపలో బేల్దారి పనులు చేసుకుంటూ ఉన్న మస్తాన్ రెడ్డిని మహాశివరాత్రి పండుగకు రావాలని కోరింది. దాంతో అతను బుధవారం 10.30 గంటలకు ఆమె ఇంటికి వచ్చారు. స్నానం చేసే రావాలంటూ అతన్ని బాత్రూంలోకి పంపింది. బయట గడియ పెట్టి తలుపుపై భాగం నుంచి పెట్రోల్ పోసి నిప్పంటించింది. దాంతో మంటలతో ఒక్కసారిగా బయటపడ్డ మస్తాన్ రెడ్డి ఎదురుగా ఉన్న వజ్రమ్మ కుమార్తె లావణ్యను అంటుకోగా ఆమె గాయాలకు గురైంది. మస్తాన్ రెడ్డి మంటలు ఆర్పుకుని ఇంటి నుంచి బయటపడ్డాడు. 108 వాహనంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ వేణు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

కుష్టు నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : వెంగళరావునగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అడిషనల్ డిఎంహెచ్ఒ లెప్రసీ నెల్లూరు, డాక్టర్ షేక్ ఖాదర్ వలీ ఆధ్వర్యంలో జాతీయ కుష్టు నివారణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే క్షయ, ఎయిడ్స్ వ్యాధులపై అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైన కలదని తెలియజేస్తూ విక్షతను నిర్మూలిద్దాం.. గౌరవాన్ని స్వాగతిద్దాం.. అంటూ నినాదం విద్యార్థులతో పలికించారు. డిపిఎంఒ ఆర్.వి.నరసారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు మంచి అవగాహన కలిగి నిరంతరం ముందు జాగ్రత్తలు తీసుకుంటూ పరిశుభ్రతను పాటిస్తూ వ్యాధి సోకిన భయపడకుండా తగిన చికిత్స విధానాలు స్వీకరించిన తరువాత నివారణకు వీలు అవుతుందని తెలియజేశారు. వెంగళరావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ టి.రమ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యాల్ హయ్యామ్, సీనియర్ ఉపాధ్యాయులు బి.శాంతకుమారి, బి.శర్వాణి, కె.ఎస్. అంజాద్ అలీ, ఐ.శ్రీనివాసులు షేక్.సాబిరా బేగమ్, ఎ.శ్రీలక్ష్మీ, వై.రజని, బి.సుమనా, ఎ.వెంకట సుబ్బయ్య, కె.ఏసురత్నం, షేక్.మహబూబ్ మస్తాన్, కె.జయప్రకాశ్, టి.కనకలక్ష్మి, జి.మారమ్మ, వైద్య సిబ్బంది జిల్లా టి.బి. కోఆర్డినేటర్ విజయ్ సి.ఒ.,ప్రసాద్, సీనియర్ స్టాఫ్‌నర్స్ రమాదేవి, ఆశావర్కర్స్ శాంతి, మహేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని తిమ్మానాయుడు పేట, మర్రిపాడు, నందవరం గ్రామాల్లోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం సరస్వతి దేవి పూజ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతి దేవి అమ్మవారిని విశేష పుష్పాలతో అందంగా అలంకరించి విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్చి 18న జరిగే పబ్లిక్ పరీక్షలకు కష్టపడి చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలన్నారు. నందవరం పాఠశాలలో జరిగిన పూజ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య ముఖ్య అతిథిగా పాల్గొనగా ఉపాధ్యాయులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ శాంతి, తిమ్మానాయుడుపేటలో సింగనపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, వెంకటరెడ్డి, ఖాన్సావలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల చెంతకే వైద్య సేవలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : పేదల చెంతకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని వైసిపి నాయకులు తాతపూడి అభిసలం అన్నారు. బుధవారం మండలంలోని వేంపాడు గ్రామంలో రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పాల్గొని 370మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెండో విడతలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపిడిఒ వెంకటకృష్ణ కుమారి, సర్పంచ్ విజయమ్మ, వైద్యులు ఆయేస, నాయకులు మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం బహూకరణ

ప్రజాశక్తి-ఉదయగిరి : నియోజకవర్గం టిడిపి – జనసేన ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌ను నియోజకవర్గం జనసేన పార్టీ పాయింట్ అఫ్ కాంటాక్ట్ కొట్టే వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొబ్బురి వెంగళరావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి కొండలరావు కలిశారు. బుధవారం వింజమూరు టిడిపి కార్యాలయంలో వారు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి రాబోయే ఎన్నికలలో చేయాల్సిన కార్యాచరణ గురించి చర్చించి కాకర్ల సురేష్‌కు వారు నందమూరి తారక రామారావు ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో కాకర్ల సురేష్ గెలుపునకు అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కాకర్ల సురేష్ వెంగమాంబ దేవస్థానంలో పూజలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకోనున్నారు.

గర్భిణులు రక్తహీనతను అధిగమించాలి

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం స్ఫూర్తితో బుధవారం ఉదయం10గంటలకు కావలి శంకులవారి తోటలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రామ్‌సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటూ రక్తహీనత లేకుండా చూసుకుంటూ, క్రమం తప్పకుండా డాక్టర్ల దగ్గర వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని, అదేవిధంగా లింగవివక్షత ఉండరాదని అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సాధించాలన్నారు. తదుపరి గర్భిణులు, బాలింతలకు ఐరన్, పొలిక్ సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు రాజ్యలక్ష్మి, రుక్మిణి, పద్మావతి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేశాం..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రమంతటా వైసిపి అభ్యర్థులు విజయం సాధిస్తారని, ఆ స్థానాల్లో ఆత్మకూరు టాప్ – 10లో తప్పక ఉంటుందని తెలిపారు. బుధవారం నెల్లూరులోని మేకపాటి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్ వైసిపి అభ్యర్థిగా రాజ్యసభ సభ్యులు వేణంబాక విజయసాయిరెడ్డి నియమితులయ్యాక జిల్లాకు రానుండడంతో కావలి నుండే ఆయనకు ఆహ్వానం పలికేందుకు తామంతా తరలి వెళ్లి ఆయనకు ఘన స్వాగతం పలికామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు ఎంఎల్ఎ మేకపాటి మాట్లాడుతూ గత సంవత్సరం రోజులుగా తాను చూస్తూనే ఉన్నానని, బలమైన ప్రత్యర్థి కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. బలమైన ప్రత్యర్థి వస్తేనే తమకు కూడా నిరూపించుకునేందుకు వీలవుతుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, ప్రజలకు తాము అందజేస్తున్న అభివద్ధితో పూర్తిగా ప్రజలందరూ తమ వెంటే ఉన్నారన్న విషయాన్ని అర్థమయ్యేలా చెబుతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక మాట చెప్పారంటే తప్పక చేస్తారనే అభిప్రాయం ప్రజల్లోకి వచ్చిందని, మేనిఫెస్టోకు నిజమైన అర్థం చెప్పిన ఇచ్చిన ప్రతి హామీని అమలు పరిచి మళ్లీ ప్రజల ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అభివృద్ధి ఎప్పుడూ జరుగుతూనే ఉండాలని, ఆత్మకూరు నియోజకవర్గంలో మూడు జాతీయ రహదారులు, సమీపంలోనే రెండు పోర్టులు వస్తుండడంతో రానున్న రోజుల్లో పారిశ్రామికంగా అభివృద్ధి జరగనుందన్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి విశ్వవిద్యాలయం ద్వారా మరింత మంది ఔత్సాహికులను తయారుచేసి నియోజకవర్గ పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వాములను చేస్తామన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేసిన సంక్షేమాన్ని వివరిస్తూనే ప్రతి గ్రామానికి తాము చేయనున్న పనులను మేనిఫెస్టోలో రూపంలో వివరిస్తున్నామని, ప్రజలకు తప్పక ఆశీర్వదిస్తారని తెలిపారు. నారంపేటలోని ఇండస్ట్రియల్ పార్కు రెండో విడత పనులు సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని, అతి త్వరలోనే పరిశ్రమల ఏర్పాటును ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న విక్రమ్‌రెడ్డి

రోడ్డు విస్తరణకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని సోమశిల సెంటర్ నుండి ఆర్టీసి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని బుధవారం ఆత్మకూరు సిపిఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గత ఐదు సంవత్సరాల క్రితం అర్ధాంతరంగా నిలిచిపోయిన సోమశిల సెంటర్ నుండి ఆర్టీసి డిపో వరకు రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ సంధాని డిమాండ్ చేశారు. సోమశిల సెంటర్ నుండి ఆర్టీసి డిపో వరకు తీవ్రమైన ట్రాఫిక్ సమస్యతో ప్రజలు రోజు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ పోతుంది. ఆ సమయంలో ప్రజలు నడిచి వెళ్లేందుకు కూడా నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2014 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నెల్లూరుపాలెం నుండి మినీ బైపాస్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. అందులో సోమశిల సెంటర్ నుండి ఆర్టీసి వరకు రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఇకనైనా రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పట్టణ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దాదాపు 300మంది సంతకాలు చేసినట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు సాదిక్ హుస్సేన్, నారయ్య, ఐద్వా నాయకురాలు గుల్జర్ బేగం, డివైఎఫ్ఐ నాయకులు నంద శీను, రమణయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాదర్ బాషా తదితరులున్నారు.

సంతకాల సేకరణ చేపడుతున్న సిపిఎం నాయకులు



విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-కావలి రూరల్

రాజ్యసభ సభ్యులు, నెల్లూరు వైసిపి ఎంపి అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా తొలిసారిగా జిల్లాకు వస్తున్న విజయసాయిరెడ్డికి కావలి రూరల్ మండల పరిధిలోని రుద్రకోట జాతీయ రహదారిపై ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కావలి నియోజవర్గం నుంచి భారీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. విజయసాయిరెడ్డి అక్కడకు చేరుకోగానే భారీ గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు ఎంపి అభ్యర్థిగా విజయసాయిరెడ్డి పేరు ప్రకటించగానే టిడిపి నాయకుల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. వైసిపిని మోసం చేసి వెళ్లిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం విజయసాయిరెడ్డిని 600 కార్లతో భారీ ర్యాలీగా కావలి పట్టణంలో నుంచి నెల్లూరుకు వెళ్లారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, కందుకూరు పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, కనుమలపూడి నారాయణ, కామరాజు, జెడ్‌పిటిసి జంపాని రాఘవులు, మాజీ జెడ్‌పిటిసి కందుల శ్రీనివాసులు, కావలి నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ శేషారత్నం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రక్తదానం చేయడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని ఆపదలో ఉన్న వారికి ఇది ప్రాణదానంతో సమానమని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారత్నం పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అపోలో డయాలసిస్ ఇన్‌ఛార్జి రవి రాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారత్నం మాట్లాడుతూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా యువత రక్తదానం చేయడంలో చొరవ చూపి ముందుండాలన్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తులు మూడు నెలలకోమారు రక్తదానం చేయవచ్చని సూచించారు. మొత్తం 30మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ ఉషా సుందరి, అపోలో డయాలసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

50పళ్లకే పెన్షన్ అమలు హర్షణీయం

ప్రజాశక్తి-కావలి

బిసిలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అమలు చేస్తామనడం హర్షణీయమని, పెన్షను కూడా నెలకు రూ.4వేలకు పెంచడం బిసిలపై తెలుగుదేశం, జనసేన ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని బిసి సెల్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పుటూరు బాల గురుస్వామి, రాష్ట్ర బిసి సాధికార కమిటీ సభ్యులు కావేటి కోటయ్య, బిసిసెల్ కావలి పట్టణ అధ్యక్షులు గుండ్లపల్లి శివాజీ యాదవ్, కావలి పట్టణ బిసిసెల్ ఉపాధ్యక్షులు పసుపులేటి చంద్రశేఖర్, కావలి పట్టణ బిసిసెల్ ప్రధాన కార్యదర్శి వేటూరి శివకుమార్, కావలి నియోజకవర్గం యువత అధ్యక్షులు పూడిపర్తి మురళీకృష్ణలు బుధవారం కావలి టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగన్ పాలనలో 30 మందికి పైగా బిసిలు క్రూరంగా హత్యకు గురయ్యారని, బిసిలపై దాడులు, దౌర్జన్యాల నుండి రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువచ్చారన్నారు. బిసి సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం రూ.75వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక బిసి సబ్‌ప్లాన్ నిధులు బిసిల కోసమే వినియోగించేలా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్‌ను వైసిపి ప్రభుత్వం 34 శాతం నుండి 24 శాతానికి తగ్గించి, 16,800 పదవులు దూరం చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక 34శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించడం జరుగుతుందని, చట్టసభల్లో బిసిలకు 33శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. అన్ని సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. తక్కువ జనాభాతో, ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తామన్నారు. స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. జగన్ రెడ్డి ఆదరణ లాంటి 30 పథకాలు రద్దు చేశారని, టిడిపి – జనసేన ప్రభుత్వం వచ్చాక రూ.5వేల కోట్లతో ఆదరణ పరికరాలివ్వడం జరుగుతుందన్నారు. చంద్రన్న బీమా రూ.10లక్షలతో పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. పెళ్లి కానుకలు రూ.లక్షకు పెంచడం జరుగుతుందని, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యా పథకాలు అన్నీ పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. షరతులు లేకుండా విదేశీ విద్య అమలు చేయడం జరుగుతుందన్నారు. పిజి విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం, స్టడీ సర్కిల్, విద్యోన్నతి పథకాలు పునప్రారంభించడం జరుగుతుందన్నారు. బిసి భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను ఏడాదిలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సాధికార కమిటీ సభ్యులు కమ్మిశెట్టి రమణయ్య, నియోజకవర్గ రజక సాధికార కమిటీ సభ్యులు గంజాం మహేష్ పాల్గొన్నారు.

బిసి డిక్లరేషన్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో లక్ష్మీదేవి అధ్యక్షతన ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి నారాయణరావు పెద్ద కుమారుడు దివానపు లోకేష్ కుమార్ 12వ వర్ధంతి సందర్భంగా 40మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18న ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ మనోహర్‌రాజు, విశ్రాంత భారతి సేవాసమితి సభ్యులు, మోటివేటర్ నారాయణ రావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆత్మస్థైర్యం కలిగి ఉండడంతో పాటు ఆహార, ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలు పాటించి పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. సబ్జెక్టుల వారీగా ఏవైనా సందేహాలు ఉన్న ఎడల సంబంధిత టీచర్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. బట్టీపట్టి చదవడం కాకుండా, పాయింట్లు వారీగా చదవడం చక్కటి దస్తూరి కలిగి ఉండడం మంచి ఫలితాలు పొందడంలో కీలక పాత్ర వహిస్తాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరికలు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ దేవరకొండ భాస్కర్, మాజీ వార్డు సభ్యులు పిట్టు మధు, సత్యం, మల్లికార్జున, డబ్బేరు శ్రీధర్, వరుణ్ చింటూ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి వైసిపి పార్టీలో చేరారు. వారికి ఎంఎల్ఎ వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై పార్టీలో చేరారని, పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుల తుమ్మల రమణయ్య, బోగోలు సర్పంచ్ పి.అనిత, యువత నాయకులు మేకల శ్రీను, విశ్వనాథరావుపేట ఎంపిటిసి ఎకె సుందర్ రాజ్, సీనియర్ నాయకులు మద్దిబోయిన శేఖర్ యాదవ్, వార్డు సభ్యులు నిర్మల్‌కుమార్, బొంత సుధీర్, పద్మమ్మ, షమీవుల్లా, నాయకులు, తదితరులున్నారు.

మాట్లాడుతున్న పసుపులేటి సుధాకర్

మూడు రోజుల్లో మేనిఫెస్టో ప్రకటిస్తా..

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గ అభివృద్ధికి మూడు రోజుల్లోనే మేనిఫెస్టోను ప్రకటించి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుస్తానని పిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు, త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అధినేత, గత ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, వేలాది ఓట్లు సాధించిన పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పిఎస్ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కావలి నియోజక వర్గంలో 204 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని చెబుతూ కావలి పట్టణంలో తాను పిలుపునిస్తే దాదాపు 30వేలమంది ప్రజలు తన బహిరంగ సభకు హాజరయ్యారని తెలిపారు. ఓడిపోయినా తాను నిరంతరం నియోజక వర్గ ప్రజలకు నిస్వార్థంగాసేవలు చేస్తున్న విషయం తన ప్రజలకు తెలుసన్నారు. ఎన్నికల ప్రచారం కోసం భారీగా ప్రచార రథాలు, కళాకారుల బృందాలను రంగంలో దింపామన్నారు. ఈ దఫా 2024 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నానని, తనను ప్రజలు ఆదరించి ఎంఎల్ఏగా గెలిపించాలన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

ప్రజాశక్తి-బిట్రగుంట

బిట్రగుంట గ్రామంలో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం అని పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ వారి ఆధ్వర్యంలో బిట్రగుంట సంగ్ సెక్రటరీ రాజశేఖర్, రన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ పి.జీవన్ కుమార్, గోవిందు రాజులు సహకారంతో క్రికెట్ టోర్నమెంట్‌ను ఫిబ్రవరి 29వ తేదీ నుండి మార్చి 6వ తేదీ వరకు బిట్రగుంట రైల్వే హాస్పిటల్ వెనక ఉన్న క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపులేటి సుధాకర్ మాట్లాడుతూ బిట్రగుంటను ఒకప్పుడు మినీ ఇంగ్లండ్‌గా పిలిచేవారని, బిట్రగుంటలో ఫుట్‌బాల్, క్రికెట్ క్రీడలను ఎక్కువగా జరిపే వారని, బిట్రగుంట లోన్ క్రీడల కోట కిందనే స్టేట్ గవర్నమెంట్, సెంట్రల్ గవర్నమెంట్‌ను ఉద్యోగాలు చేస్తున్నారని బిట్రగుంట అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ జీవన్‌కుమార్ మాట్లాడుతూ విజయవాడ డివిజన్ స్థాయిలో రైల్వే ఉద్యోగుల కోసం క్రికెట్ టోర్నమెంటును చెరిపామని, క్రికెట్ టోర్నమెంట్లో 40 టీములు పాల్గొనగా వారిలో విన్నర్స్ బిట్రగుంట రైల్వే లోకో టీం గెలుపొందిందని, రన్నర్స్ రాయంపాడు రైల్వే వర్క్‌షాప్ టీం గెలుపొందని తెలిపారు. గెలుపొందిన విజేతలకు పసుపులేటి సుధాకర్, ఆస్టర్ రమేష్ హాస్పటల్ చీఫ్ డాక్టర్ శివకుమార్ చేతుల మీదుగా బహుమతులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు రైల్వే డాక్టర్ రమణ, సాంగ్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ జి శ్రీనివాసులు, లోకో రైల్వే ఇన్‌స్పెక్టర్ బాబురావు, సత్యనారాయణ, శేఖర్ బాబు, శ్రీను, విజయవాడ డివిజన్ అన్ని శాఖల రైల్వే ఎంప్లాయిస్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు కప్ అందిస్తున్న పిఎస్ఆర్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..

ప్రజాశక్తి-కావలి

కాపు మహిళా నేత, మాజీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి శ్రీదేవి బుధవారం బిజెపిని వీడి టిడిపిలో చేరారు. బుధవారం ఆమెతో పాటు డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ సాయి సుస్మిత, డాక్టర్ వైష్ణవి, భారతి, దిలీప్, విజయ్ కుమార్, మొగిలిశెట్టి పద్మ, పురిణి మాధవి, సుబ్బరత్నమ్మ, లక్ష్మీ, కె.మాధవి, ఆర్.లక్ష్మీ, ఎం.లక్ష్మీ, నిషాంత్, వెంగయ్య చౌదరి, విజయలక్ష్మి, తదితర 20 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. వీరందరికీ కావలి అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మావతి శ్రీదేవి మాట్లాడుతూ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు కావ్య క్రిష్ణారెడ్డి అని, కావలిని అభివృద్ధి చేయగల సమర్థుడు అని అన్నారు. కేవలం ఆయనను ఎంఎల్ఏగా గెలిపించుకోవాలనే ఉద్దేశంతో టిడిపిలో చేరినట్లు తెలిపారు. కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తనపై అభిమానం చూపుతూ పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఎంఎల్ఏగా తనను, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, అందరి సహకారంతో కావలిని అభివృద్ధి పథంలో నడుపుతానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, 18వ వార్డు ఇన్‌ఛార్జి శానం హరి, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ కండువాకప్పుతున్న కావ్యక్రిష్ణారెడ్డి

పరీక్షల పర్యవేక్షణ అధికారి మృతి

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న డిపార్ట్‌మెంట్ అధికారి పఠాన్‌కమల్ హస్సన్ గుండె పోటుతో మృతి చెంది నట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. బుధవారం ఉదయం పరీక్ష పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రానికి తీసుకునే వెళ్లే క్రమంలో కొంత అలసటగా ఉందని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. మృతుడు మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేలు వాసి అని సిబ్బంది తెలిపారు.

పఠాన్‌కమల్‌హస్సన్ (ఫైల్)

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లను బుధవారం వేలం నిర్వహణాధికారి రాజశేఖర్, బోర్డు అదనపు మార్కెటింగ్ అధికారి దామోదర్, అధికారులు, రైతులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాన్ని ప్రారంభించారు. మూడు ప్రాంతాల నుండి 18పొగాకు బేళ్లను వేలంలో ఉంచారు. 12 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి. అన్ని బేళ్లు కిలో రూ.230 ధర పలికాయి. అనంతరం వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కంపెనీ వారు రూ.5 నుండి రూ.20లకు పెంచేవారు ఈ ఏడాది రూ.30 పెంచారన్నారు. అలాగే ప్రతేడాది రైతులు పొగాకు సాగును పెంచుకుంటూ పోతున్నారని, ఒక ఏడాది 4 మిలియన్ కేజీలు పొగాకు కొనుగోళ్లకు అనుమతి ఇవ్వగా, మరో ఏడాది 5 మిలియన్లు, ఈ ఏడాది 9.3 మిలియన్ కేజీలు పొగాకు పంటను పండించారన్నారు. రైతులు పొగాకు పంటను విపరీతంగా సాగు చేయటం వల్ల నష్టపోయే అవకాశం ఉందన్నారు. పొగాకు రైతులకు కావాల్సిన పలు సౌకర్యాలు, ఇన్‌పుట్స్ బోర్డు కల్పిస్తుందన్నారు. బోర్డు రైతు శ్రేయస్సు కోసం పాటుపడుతుందని వారికి ఏం అవసరమో అందిస్తుందన్నారు. గతంలో తుపాను ప్రభావం వల్ల పంట నష్టపోయిన రైతులకు బోర్డు వడ్డీ లేని రుణాలు రూ.30కోట్లు అందించిందని తెలియజేశారు. పొగాకు సూర బయట రూ.20 నుండి రూ.30లకు వ్యాపారస్తులు కొనుగోలు చేయగా, బోర్డులో రూ.100 సగటు ధర వచ్చేలా కృషి చేశామని తెలిపారు. మూడేళ్ల నుండి పొగాకు సగటు ధర రూ.90 ఇచ్చామని తెలియజేశారు. గత ఏడాది రైతులు పంటకు నీళ్లు కట్టేందుకు సబ్సిడీ ద్వారా పైపులు అందించామని, పొగాకు రైతు అకస్మాత్తుగా మరణిస్తే ఇన్సూరెన్స్‌ను రూ.2లక్షల నుండి రూ.5లక్షలు పెంచామని, బ్యారెన్ ఇన్సూరెన్స్‌ను రూ.2లక్షల నుండి రూ.6లక్షలకు పెంచామన్నారు. రైతు బోర్డులో అమ్మిన పొగాకు నగదు గతంలో 11 రోజులకు ఖాతాల్లో జమ కాగా, ప్రస్తుతం 8 రోజులకు రైతుల ఖాతాల్లో జమవుతుందన్నారు. డిమాండ్ ఉందని అధిక ధరలు పెట్టి బ్యారెన్‌లు లీజుకు తీసుకోవడం, పంట ఎక్కువ పండించడం వల్ల రైతులు నష్టపోతారన్నారు. బోర్డుకు 6.4మిలియన్ కేజీలు అనుమతి ఇచ్చిందని అంతవరకు పండిస్తే ధరలు ఉంటాయన్నారు. ఒక్కో బ్యారెన్‌కు 3650 కేజీలు పొగాకు అమ్ముకునేందుకు అనుమతి ఉందన్నారు.

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, పొగాకు బోర్డు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు, మూలి వెంగయ్య మాట్లాడుతూ మార్కెట్ ధరలు చూస్తే రైతులు నిరుత్సాహంగా ఉన్నారన్నారు. అధిక ధర కేజీ 230 రూపాయలకు కొనుగోలు చేశారని, ఏడాదిలో గ్రేడ్ ఎక్కువగా ఉంటుందని అత్యల్ప ధర ఎంత ఉంటుందో తెలియదన్నారు. గతేడాది కేజీ రూ.280 అధిక ధర పలుకగా ఈ ఏడాది ఆ ధరలు ఉండవని రైతులు ఆందోళన చెందుతున్నారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50శాతం ఇవ్వాలన్నారు. గతంలో కంటే ఈ ఏడాది అన్ని ఖర్చులు పెరిగాయన్నారు. అధిక ధర రూ.350, సగటు ధర రూ.300 ఉండాలన్నారు. రైతులు ఎక్కువ పంటను పండించారని బోర్డు అధికారులు అంటున్నారని గతంలో ఎంత పండిస్తే అంత కొనుగోలు చేయడంతో రైతులు ఈ ఏడాది పొగాకు పంటను అధికంగా సాగు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకొని సగటు ధర రూ.300 వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కౌలు రైతుసంఘం నాయకులు లక్ష్మీపతి, లక్కు ప్రసాద్ పాల్గొన్నారు.

పొగాకును పరిశీలిస్తున్న అధికారులు

మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఎం.వి.ఓ.పి.నెం:3/2021

జంకె చిన్న రాజమ్మ
అలియాస్ రాజేశ్వరి మరియు ఇతరులు... పిటీషనర్లు
వర్సెస్
తోట తిరుపతిరావు మరియు ఇతరులు
.... రెస్పాండెంట్స్

టు,
రెస్పాండెంట్ నెం: 5.
జంకె శివారెడ్డి తండ్రి: లేట్ పెద్ద మల్లారెడ్డి,
తండ్రి: మల్లయ్య అమలనాధునివారిపాలెం,
కందుకూరు (పోస్ట్ అండ్ మండలం)
నెల్లూరు జిల్లా.

పై నెంబరు ఎం.వి.ఓ.పి. నెం: 3/2021లో కోర్టు వారు 5వ రెస్పాండెంట్‌కు ఎన్ని పర్యాయములు నోటీసులు జారీ చేసిననూ, అందని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఆర్డర్ వేసినారు. కావున మీరు తేదీ:03-04-2024న స్వయముగా గానీ, మీ వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 03-04-2024

ఇట్లు
భూపని కాశయ్య
అడ్వకేట్, మార్కాపురం.
సెల్: 991272689.


వేమిరెడ్డిని సన్మానిస్తున్న ఎంఎల్ఎ కోటంరెడ్డి

కోటంరెడ్డిని కలిసిన 'వేమిరెడ్డి'

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయంపై పలు అంశాలు చర్చించుకున్నట్లు తెలుస్తుంది. వేమిరెడ్డిని కోటంరెడ్డి బ్రదర్స్ సన్మానించారు. ఆయన వెంట రూప్ కుమార్ యాదవ్ ఉన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రాబోయే ఎన్నికల్లో టిడిపి తరపున కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పోటీ చేస్తున్నారని ప్రజలందరూ ఆయనను ఆశీర్వదించి గెలిపించాలని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవిలు పేర్కొన్నారు. 35వ డివిజన్ లో బుధవారం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రజలనుంచి మంచి స్పందన వస్తుందని, గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించి వారికి అండగా నిలబడతారన్నారు. టిడిపితోనే మహిళలకు కొండంత భరోసా, భద్రత ఉంటుందని తెలిపారు.

ఘనంగా సరస్వతి పూజ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండల కేంద్రమైన ఎఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకట రమణారెడ్డి, డైరెక్టర్ దొరసామిరెడ్డి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు సందర్భంగా పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సరస్వతి దేవిని పూజించి ఆశీర్వాదం తీసు కున్నట్లు, అలాగే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ పాల్గొని సరస్వతి దేవిని పూజించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, డైరెక్టర్ కె.దొరస్వామిరెడ్డి, పాఠశాల

విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-కొడవలూరు

రాజ్యసభ సభ్యులు వైసిపి జాతీయ కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డిని ఆ పార్టీ ఎంపి అభ్యర్థిగా ప్రకటించాక తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన సందర్భంగా కోవూరు నియోజకవర్గ నేతలు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకు మార్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ నేతలు నార్తు రాజుపాలెం జాతీయ రహదారి ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు బుధవారం ఉదయం7 గంటలకే పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డి అక్కడికి చేరుకోగా నియోజకవర్గంలోని నేతలు మండలాల వారీగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఒక్కో మండలం నేతలు వేర్వేరుగా పుష్పకు చాలు ఇచ్చి స్వాగతించారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి అన్ని మండలాల నేతలను ఎంపీ అభ్యర్థి విజయసాయి రెడ్డికి పరిచయం చేశారు.

ఎస్ఇఐఎల్ ఎనర్జీని సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండల పరిధిలోని ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌ను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వి. సంజన సింహ బుధవారం సందర్శించారు. ప్రముఖ స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారు ఎస్ఇఐఎల్ తక్కువ బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు అతి తక్కువ కార్బన్‌ను విడుదల చేసే సూపర్ క్రిటికల్ టెక్నాలజీ గురించి ఆమె కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ ఆపరేషన్స్ హెడ్ ప్రవీణ్ కుమార్ సుంకర, రిలయబిలిటీ హెడ్ జెవిఎల్వైచ్ నాగేశ్వరరావు ప్లాంటు నిర్వహణ కోసం అవలంభిస్తున్న ప్రపంచ స్థాయి పర్యావరణ అనుకూల విధానాలు, భద్రత ప్రమాణాల గురించి వివరించారు. విద్యుత్ ఉత్పత్తి, పీక్ లోడ్ గురించి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (ఏ పీపీసీబీ)ఈ ప్లాంటును ఒక మోడల్ పవర్ ప్లాంట్‌గా ఎంపిక చేసి అసిస్టెంట్ కలెక్టర్ పర్యటనకు ఏర్పాటు చేసింది. పర్యవరణానికి తక్కువ హాని

కలిగించే సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగాలు తెలుసుకున్న సంజన సింహ అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్న కంపెనీ యజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ పీ సీబీ అధికారులు శశికళ, శర్మ వారితో ఉన్నారు. సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ భారతదేశ ఇంధన భ ద్రతకు దోహదం చేయడానికి కట్టుబడి ఉన్న ప్రముఖ స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారు (ఐపిపి). దేశంలో థర్మల్ విద్యుదుత్పత్తి ఆస్తులను అభివృద్ధి చేసి నిర్వహించడంలో కంపెనీకి విజయవంతమైన ట్రాక్ రికార్డు ఉంది. 2.64 గిగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సముదాయం. ఎస్ఇఐఎల్ ఈ ప్రాంత పురోగతిలో నిబద్ధతతో కూడిన, దీర్ఘ కాలిక భాగస్వామిగా ఉంది. ఇది ఉపఖండం అంతటా వినియోగదారులకు విశ్వసనీయమైన, స్థిరమైన విద్యుత్తును అంది స్తు ంది. భారతదేశ ఇంధన భద్రత, అభివద్ధి లక్ష్యాలకు మద్దతు ఇచ్చే దిశగా ప్రభుత్వం పరి శ్రమతో సే యిల్ ఎస్ఇఐఎల్ భాగస్వామ్యం. ప్లాంటుకు విచ్చేసిన అసిస్టెంట్ కలెక్టర్‌కు కంపెనీ అధికారులు ఘన స్వాగతం పలికారు.

'దాడులకు భయపడను'

ప్రచారంలో పాల్గొన్న మాజీమంత్రి నారాయణ

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ఎన్ని సార్లు రైడ్స్ చేయించినా భయపడనని...ఇంకా ఎన్ని సార్లు చేయిస్తావో చేయించుకో అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ సవాల్ విసిరారు.బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా... నెల్లూరు నగరం 11,52వ డివిజన్ లలోని ఎన్టీఆర్ నగర్ ,రాయపాలెం, బర్మాషెల్ గుంట ..పాత చెక్ పోస్ట్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. అనంతరం మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడారు. ఇది అరాచక పరిపాలనని...ప్రజా పరిపాలన కాదని...అసలు ప్రజల అవసరాలు తీర్చే ప్రభుత్వం కాదని మండిపడ్డారు. కేవలం ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసి వాళ్ల వైపునకు తిప్పుకోవాలన్నదే ప్రయత్నం అన్నారు. నారాయణ గ్రూప్స్ పై ఎందుకు రైడ్ చేశారో వారికి తెలియదన్నారు. స్కూల్ బస్సులకి ట్రాన్స్ పోర్ట్ అంటున్నారని...అసలు ట్రాన్స్ పోర్ట్‌కి... డాక్టర్లు, వ్యాపారస్తుల ఇళ్లలో సోదాలు చేసిన దానికి సంబంధం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఏదైనా నోటీసులు ఇవ్వండని...ఏమైనా కట్టాల్సి ఉంటే కడుతారన్నారు. అంతే కానీ నోటీసు ఇవ్వరని... ఏం చెప్పరని... అకస్మాత్తుగా150 మంది పోలీసులతో రావడం...నారాయణకి దగ్గర ఉండే వాళ్లపైన...టీడీపీ నేతలు, డాక్టర్లు, లెక్చరర్స్, ఎంప్లాయిస్ ఇళ్లలోకి వచ్చి సోదాలు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అసలు ఇది ప్రజాస్వామ్యమేనా అని ప్రశ్నించారు. నిరుపేదలందరి సొంతింటి కలను ఖచ్చితంగా నెరవేరుస్తానన్నారు.

మొగిలిచర్లకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-కావలి

శివరాత్రి జాగరణకు మొగిలిచర్ల దత్తాత్రేయక్షేత్రంకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం కావలి నుండి మొగిలిచర్ల కు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి, కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నుండి శనివారం మధ్యాహ్నం వరకు బస్సులు నడుపుతామని తెలిపారు. కావలి నుండి లింగసముద్రం మీదుగా

10 బస్సులు, కొమ్మి మీదుగా 8 బస్సులు, సాయిపేట మీదుగా 7 బస్సులు మొత్తం 25 బస్సులను నడుపుతామని వివరించారు. అంతేకాక పెద్దపవని బస్టాండ్, కలిగిరి, కొండాపురం, లింగస ముద్రం, తాతాహోటల్, మొగిలిచర్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం వలంటీర్లను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కావున మొగిలిచర్ల దత్తాత్రేయ క్షేత్రాన్ని సందర్శించే భక్తులు, అక్రమ వాహనాలలో కాకుండా, ఆర్‌టిసి బస్సులలోనే ప్రయాణించి సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్యం చేరాలని కోరారు.

పాఠశాలలో సరస్వతి పూజ

ప్రజాశక్తి-వరికుంటపాడు:మండలంలోని విరువూరు, పెద్దిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల హాల్ టికెట్లను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరువూరు ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసే విద్యార్థులకు కడియంపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎం.సుధాకర్ పరీక్ష రాసేందుకు అవసరమైన సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. అలాగే పెదిరెడ్డిపల్లి పాఠశాలలో పరీక్షలు రాసే విద్యార్థులకు ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఆర్.నాగార్జున పరీక్ష సామగ్రిని అందజేశారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆనందంతో పరీక్ష రాయాలని ఉపాధ్యాయులు విద్యార్థులను దీవించారు.

మాట్లాడుతున్న నాయకులు

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కావలి

అఖిల భారత చిరంజీవి యువత గౌరవ అధ్యక్షులు నాగబాబు సూచనల మేరకు జనసేన జాతీయ మీడియా ఇన్‌ఛార్జి వేములపాటి అజయ్‌కుమార్ ఆశీస్సులతో జిల్లాతో పాటు, కావలిలో కూడా పవన్ కళ్యాణ్‌ఫ్యాన్స్ నూతన కమిటీ ఎన్నుకున్నట్లు తెలియజేశారు. కావలి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో జనసేన, టిడిపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపిస్తామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ నియోజకవర్గ అధ్యక్షులు ఆలా శ్రీనాథ్, పట్టణ అధ్యక్షులు మన్నేపల్లి రుషికేష్ తెలియజేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కావలి నియోజకవర్గం పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులుగా ఆలా శ్రీనాథ్, కావలి పట్టణ అధ్యక్షులుగా మన్నెపల్లి రిషికేష్, ఉపాధ్యక్షులు కామిశెట్టి మురళీకృష్ణ, రూరల్ అధ్యక్షులు గుడిపల్లి వెంకయ్య గౌడ్, ఉపాధక్షులు వాయిల వెంకయ్య బాబు, నియోజకవర్గం ట్రెజరర్ సూరిపోగు రాజేష్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి బొమ్మల విద్యాసాగర్, గెడే మహేంద్ర కార్యదర్శి మండ శ్రీను, టౌన్ ప్రధాన కార్యదర్శి భావనాసి రాంబాబులకు చోటు కల్పించినట్లు తెలిపారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

వికలాంగుల ఆపద్బాంధవుడు, మహా జననేత మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మార్చి 9 చలో అమరావతి వికలాంగుల హక్కుల పోరాట సమితి విహెచ్‌పిఎస్, అన్ని దివ్యాంగ సంఘాల మహా గర్జనను జయప్రదం చేయాలని మాదిగ వికలాంగుల సోదరులతో కలసి బుధవారం బోగోలు సెంటర్‌లోని అంబేద్కర్ బొమ్మ దగ్గర ఎంఆర్‌పిఎస్ కావలి నియోజకవర్గం అధ్యక్షుడు ఐమూరి మహేష్‌మాదిగ అధర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సినియర్ నాయకులు ఏసుపొగు జయరాజు మాదిగ మాట్లాడుతూ వికలాంగుల పింఛన్ రూ.6వేలు పెంచాలని, తొలగించిన 95వేల మందికి పింఛన్లను అందించాలని, మొత్తం 21 డిమాండ్లతో మార్చి 9న, హలో వికలాంగ్ ఛలో అమరావతి మహాగర్జనకు ప్రతి గ్రామం నుంచి దివ్యాంగులందరూ లక్షలాదిగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విక్రాంగులు లాలు, కందల దిలీప్, కందల స్వర్ణ, కందల నాగరత్నమ్మ, మహేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరిపంటను పరిశీలిస్తున్న అధికారి రవికుమార్

వరి పంటలు పరిశీలన

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని తూర్పు బోయమడుగుల గ్రామంలో సాగు చేస్తున్న వరిపంటను బుధవారం మండల వ్యవసాయ అధికారి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సస్యరక్షణ పద్ధతులలో భాగంగా కాండం తొలిచే పురుగు నివారణకు ఎకరాకు కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి 8 కిలోలు లేదా కోరంట్రాని లిఫ్టోల్ గుళికలు నాలుగు కిలోలు వాడాలని తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెలలో సంభవించిన నిజాం తుపాను వల్ల పంటలు దెబ్బతిన రైతులకు నష్టపరిహారంలో భాగంగా మండలంలోని 93మంది రైతులకు రూ.7.7 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో విఎఎ పవన్, రైతుల పాల్గొన్నారు.